# సాక్షి
## పార్వతీపురం మన్యం

మంగళవారం। 30। సెప్టెంబర్। 2025






### వైభవంగా శ్రీవారి కల్యాణం

రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. -8లో



### రీ అసెస్‌మెంట్ పూర్తయినా అందని టీఏడీఏలు..! -8లో

దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ నిర్వహించిన వైద్యులకు టీఏ, డీఏలు చెల్లించడంలో కూటమి సర్కారు జాప్యంచేస్తోంది.

### వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవిమాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ నాలుగో తేదీలోగా ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలన్నారు.

## న్యూస్‌రీల్

### సూపర్ జీఎస్టీ, సేవింగ్స్ బ్రోచర్ విడుదల



సూపర్ జీఎస్టీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

పార్వతీపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి వర్గాలకు చేకూరిన లబ్ధిని తెలియజేసే సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ బ్రోచర్ కరపత్రాన్ని కలెక్టర్ డా.ఎస్.ప్రభాకర రెడ్డి సోమవారం విడుదల చేశారు. ప్రజలకు కలిగే లబ్ధిని క్షుణ్ణంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో హేమలత, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### దసరా సంత



రద్దీగా మారిన సీతంపేట సంత

సీతంపేట: సీతంపేటలో సోమవారం జరిగిన వారపు సంత క్రయవిక్రయదారులతో కిక్కిరిసింది. దసరా ముందురోజు సంతకావడంతో పొట్టేళ్లు, నాటుకోళ్ల క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. కిలో పైబడి ఉన్న నాటుకోడి పుంజు రూ.1500లు, 15 కిలోల మేక, గొర్రె పోతులు రూ.20వేలు పైబడి ధర పలికాయి.

### సీజ్ చేసిన వాహనాలు అప్పగించండి

- ఎస్పీ దామోదర్



స్టేషన్ ఆవరణలో సీజ్‌చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: జిల్లాలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను నిబంధనల మేరకు అప్పగించాలని ఎస్పీదామోదర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. చీపురుపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీచేశారు. స్టేషన్ ప్రాంగణంలోని వాహనాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో మరిన్ని ఎక్కువ సీసీ కెమెరాలను అమర్చాలని, గస్తీ, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని, నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయించేవారు, మహిళల పట్ల దాడులకు, బాలలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు ఉన్నారు.



సరస్వతీ దేవి అలంకరణలో సాలూరులోని కామాక్షమ్మ తల్లి

### సరస్వతీ నమస్తుభ్యం



సాలూరు కామాక్షమ్మ ఆలయంలో జరుగుతున్న సామూహిక కుంకుమ పూజలు



సరస్వతీ దేవి అలంకరణలో పాలకొండ కోటదుర్గమ్మ

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ, సాలూరులోని కామాక్షమ్మ సోమవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీదేవి జన్మించిన మూలనక్షత్రంను పురస్కరించుకుని అమ్మవార్ల ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కుంకుమ పూజలు జరిపారు. – పాలకొండ/సాలూరు

### పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి చదురుగుడిలోని హుండీల ఆదాయాన్ని అమ్మవారి కల్యాణ మండపం ఆవరణలో సోమవారం లెక్కించారు. రూ.16,75,917ల నగదు, 14.100 మిల్లీ గ్రాముల బంగారం, 301 గ్రాముల వెండి, అన్నదాన హుండీ నుంచి రూ.800లు లభించినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ కె.శిరీష తెలిపారు. కార్యక్రమంలో శంబర పోలమాంబ ఈఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఇన్‌చార్జి ఈఓ కె.శిరీష

# తినోళ్లకు తిన్నంత ఉపాధి

- వేతనదారుల కడుపుకొట్టి, అక్రమార్కుల బొజ్జ నింపుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్
- అధికారులు, ఉద్యోగుల కుమ్మక్కు
- పెద్దఎత్తున నిధులు స్వాహా

సాక్షి, పార్వతీపురం మన్యం:

“గరుగుబిల్లి మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నాయి. రూ.20 కోట్ల విలువైన 1,600 పనుల్లో పెద్ద ఎత్తున లోపాలను గుర్తించారు. చెరువు పనుల కొలతల్లో తేడాలు.. హాజరుకాని వారికి వేతనాల చెల్లింపులు.. ఒకే కుటుంబానికి రెండేసి జాబ్ కార్డులు ఇవ్వడం వంటివి గుర్తించారు. నాగూరు, మరుపెంట క్షేత్ర సహాయకులు ఎక్కువగా అక్రమాలకు పాల్పడ్డారని.. వారిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు.”

“గుమ్మలక్ష్మీపురం మండలంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.35.89 కోట్లతో చేపట్టిన 2,939 అభివృద్ధి పనుల్లో వివిధ దశల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. చెముడుగూడలో చేపట్టిన ఫారం పాండ్లో ఆరు పనులు చేపట్టకుండానే రూ. 1.20 లక్షల బిల్లులు డ్రా చేశారు. నెల్లికెక్కువ గ్రామంలో పనికి వెళ్లకుండా 10 మందికి మస్తర్లు వేసి కూలి డబ్బులు చెల్లించారు. దొరజమ్ము ఆశ్రమ పాఠశాల ఆవరణలో చేపట్టిన రక్షణ గోడకు సంబంధించిన రూ.1.20 లక్షలు, బీటీ రహదారులకు సంబంధించిన బిల్లులు వెండరుకు ఇవ్వకుండా, అధికారుల ఖాతాల్లోకి జమ అయ్యాయి.”

“బలిజిపేట మండలం పెదపెంకి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పలువురికి ఇళ్లు మంజూరయ్యాయి. వీటిని 2022లో నిర్మించుకున్నారు. వీరికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం నుంచి ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున రావాల్సి ఉంది. ఆ మొత్తం కోసం ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఎన్నిసార్లు అడిగినా.. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదంటూ చెప్పుకొచ్చారు. దీనిపై వారు ఆరా తీస్తే.. వీరి మస్తర్లను వేరొకరి పేరుతో వేసి సొమ్ము పక్కదారి పట్టించినట్లు తెలిసింది. దీనిపై ఏపీవో, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని బాధితులు పూడి గంగమ్మ, సురగాల చిన్నమ్మ, సత్యవతి, కరుణ మ్మ, పెద్దింటి లక్ష్మి తదితరులు చెబుతున్నారు. ఇలా గ్రామంలో 30 నుంచి 40 మందికి సంబంధించి బినామీ మస్తర్లతో నిధులను స్వాహా చేసినట్లు తెలుస్తోంది.”



తమ నిధులను తప్పుడు మస్తర్లతో స్వాహా చేశారని చెబుతున్న పెదపెంకి గ్రామస్తులు



గ్రామీణ ప్రాంత పేదలకు పని భద్రత కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం.. ఆ శాఖలోని అధికారులకు, క్షేత్ర స్థాయి సిబ్బందికి వరంలా మారుతోంది. వేతనదారుల కడుపుకొట్టి.. వారి బొజ్జలు నింపుకొంటున్నారు. ప్రధానంగా ఉపాధి పనుల కొలతల్లో తేడాలు, తప్పుడు మస్తర్లు వేయడం.. దస్త్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడం.. బిల్లుల స్వాహా.. ఇలా ఒక్కటేమిటి అందివచ్చిన ఏ అవకాశాన్నీ సిబ్బంది వదలడం లేదు. ఇటీవల గరుగుబిల్లి మండలంలో పనులకు సంబంధించి చేపట్టిన సామాజిక తనిఖీల్లో సుమారు రూ.2 లక్షల వరకు కొలతల్లో తేడాలు, బినామీ మస్తర్లను గుర్తించారు. పనిచేయని లబ్ధిదారులకు విత్ హోల్డ్ బిల్లులు దాదాపు రూ. 5 లక్షల వరకు క్షేత్రసహాయకులు స్వాహా చేశారు. పంట పొలాలకు సంబంధించి సాగునీరు వెళ్లే పిల్ల కాలువల కొలతల్లో ఎక్కువ నమోదు చేసి, బిల్లులు పక్కదారి పట్టించారు. జిల్లాలో అనేక చోట్ల అనర్హులకు జాబ్ కార్డులున్నాయి. గ్రామాల్లో ఎవరికైనా జాబ్ కార్డు కావాలంటే రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారు. పనులు కల్పించాలంటే.. వారానికి రూ. వంద చొప్పున ఒక్కో వేతనదారు నుంచి కలెక్షన్ చేస్తున్నారు. బలిజిపేట మండలం పెదపెంకిలో తప్పుడు మస్తర్లు వేసి, పెద్ద ఎత్తున నిధుల స్వాహాపై బాధితులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో సంబంధిత సిబ్బంది రాజీ ప్రయత్నాలు మొదలు పెట్టారు.

### వారికే.. ఉపాధి వరం

జిల్లాలో 4 లక్షల మందికిపైగా వేతనదారులు ఉన్నా రు. 2.15 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఏటా పెద్ద ఎత్తున ఉపాధి పనులు కల్పిస్తున్నారు. ఉపాధి నిధుల ద్వారా వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సన్న, చిన్నకారు రైతుల పంట భూముల్లో పండ్ల తోటలతో పాటు.. రహదారుల పక్కన మొక్కలు నాటేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఎకరా పొలంలో సుమారు 70 మొక్కలు నాటేందుకు రూ. 95 వేల వరకూ సాయం అందిస్తారు. లెక్కల్లో పనులైతే చూపిస్తున్నారు గానీ.. నిధులు అక్రమార్కులకే కడుపు నింపుతోంది. చిన్న ఉద్యోగుల నుంచి అధికారుల స్థాయి వరకూ ఆదాయ వనరుగా ఉపాధి పథకం మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# కూటమిలో ప్రొటోకాల్ రగడ

- జనసేన, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం



వాగ్వాదం చేసుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

సీతంపేట: అన్న క్యాంటీన్ శంకుస్థాపన సాక్షిగా పాలకొండ నియోజకవర్గంలోని కూటమి నాయకుల అంతర్గత కుమ్ములాటలు మరోమారు బహిర్గతమయ్యాయి. టీడీపీ, జనసేన నాయకుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సీతంపేట గ్రామ సచివాలయం కార్యాలయం వద్ద రూ.60 లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్‌కు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రొటోకాల్ ప్రకారం తమను ఎందుకు పిలవలేదంటూ టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి, మండల కన్వీనర్ సవర తోట ముఖలింగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.రాజబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బి.జయలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ ఎం.మోహన్ రావు, ఎస్.మంగయ్య తదితరులు నిర్వాహకులను నిలదీశారు. ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్యేను సైతం ప్రశ్నించారు. ఓట్లు వేసిన కార్యకర్తలను వదిలేసి, ఎటువంటి అర్హత లేని వారికి ప్రాధాన్యమివ్వడం తగదన్నారు. చివరకు మాటా, మాటా పెరిగి జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య నువ్వా.. నేనా అన్నస్థాయిలో వాగ్వాదం చెలరేగింది. ఎస్ఐ వై.అమ్మన్నరావు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను సముదాయించారు.

## ఆదుకోండయ్యా...

పార్వతీపురం రూరల్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై కలెక్టర్, ఉన్నతాధికారులకు వినతులు అందజేశారు. ఆదుకోవాలంటూ వేడుకున్నారు.

### ఉపాధి చూపండి



నాకు ముగ్గురు కుమార్తెలు.. కాయకష్టంతో ఇద్దరికి వివాహాలు చేశాను.. మూడో కుమార్తె పైడి పుట్టుకతోనే వినికిడిలోపంతో పాటు మూగది. ఇంటర్ చదువుకున్న కుమార్తెకు ఉపాధి కల్పించడంతో పాటు వినికిడి యంత్రం అందజేయాలంటూ బలిజిపేట మండలం తుమరాడ గ్రామానికి చెందిన మర్రాపు అమ్మడమ్మ కలెక్టర్‌కు విన్నవించింది.

### రాజకీయ కక్షలు ఆపాలి



జిల్లాలో ప్రభుత్వ అధికారులు రాజకీయ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆరోపించారు. రావికోన పంచాయతీ సర్పంచ్ కె.రామస్వామి చెక్‌పవర్‌ను రద్దును వ్యతిరేకిస్తూ సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గిరిజనులతో కలిసి బైఠాయించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ ఒత్తిడితో సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దుచేస్తూ డీపీఓ ఆదేశాలు ఇవ్వడం తగదని, తక్షణమే చెక్‌పవర్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

### కొడుకు పట్టించుకోవడం లేదు..

వృద్ధాప్యంలో ఉన్న తనను ఉపాధ్యాయుడైన కుమారుడు పట్టించుకోవడంలేదంటూ సాలూరు పట్టణానికి చెందిన ఎం.కృష్ణంరాజు కలెక్టర్ ఎస్.ప్రభాకర రెడ్డి వద్ద విలపించాడు. దీనిపై కలెక్టర్ చలించిపోయారు. వెంటనే ఉపాధ్యాయుడిని పిలిపించి తండ్రిని చక్కగా చూసుకోవాలని, నెలకు రూ.5వేలు ఇచ్చేలా అంగీకారం కుదిర్చారు.



### ఈ నీళ్లు ఎలా తాగాలి?

మక్కువ మండలం వెంకంపేట పంచాయతీలో గల అడ్డుమండ గిరిజన గ్రామస్తులు తమ గ్రామంలో తాగునీటికి ఉపయోగిస్తున్న బోరు ద్వారా కలుషితమైన మురుగు నీరు వస్తోందని, వ్యాధుల బారిన పడుతున్నామని, తక్షణమే సురక్షితమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వారు తాగుతున్న కలుషిత నీటిని చిన్న బాటిల్‌లో తెచ్చి కలెక్టర్‌కు చూపించారు.



# వైద్యుల సమ్మె సైరన్

- జీఓ 85ను వ్యతిరేకిస్తూ విధుల బహిష్కరణ
- నిలిచిన ఓపీ సేవలు

పాలకొండ రూరల్: వైద్యులు సమ్మెసైరన్ మోగించారు. జీఓ 85ను వ్యతిరేకిస్తూ విధులు బహిష్కరణకు సిద్ధమయ్యారు. అంకిత భావంతో ప్రజలకు సేవలందిస్తున్న వైద్యులపై కూటమి వైఖరి దీర్ఘకాలిక వ్యాధిలా మారిందని వాపోతున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేదని, వేరే మార్గంలేక మంగళవారం నుంచి సమ్మెబాట పడుతున్నట్టు స్పష్టం చేశారు. సోమవారం ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. గతంలో పల్లెల్లో మూడేళ్లు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల విధులు చేపట్టిన వైద్యులకు పీజీ చేసేందుకు 30 శాతం కోటా ఉండేదని, జీఓ-85 వల్ల 15 శాతానికి తగ్గిందని, దీనివల్ల భవిష్యత్తు ఉండదంటూ వైద్యులు వాపోతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50 శాతం, ట్రైబల్ అలవెన్సులు, నోషనల్ ఇంక్రిమెంట్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చంద్రన్న సంచార చికిత్సకు సంబంధించి రూ.5వేలు అలవెన్స్‌తోపాటు నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. కచ్చితమైన పనిగంటలు, వారాంతపు సెలవులతో పాటు జాబ్ చార్ట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



ఎం.సింగుపురంలో నల్లబ్యాడ్జీలో అత్యవసర సేవలు అందిస్తున్న వైద్యులు



- డాక్టర్ల సమ్మెతో వెలవెలబోయిన పీహెచ్‌సీ

వీరఘట్టం: పీహెచ్‌సీ వైద్యుల సమ్మెలో భాగంగా సోమవారం ఓపీ సేవలు బహిష్కరించారు. వీరఘట్టం పీహెచ్‌సీలో 5 ఎమెర్జెన్సీ కేసులకు మాత్రమే చికిత్స అందించినట్లు డాక్టర్ సాయికుమార్ తెలిపారు. ప్రతిరోజు 80 నుంచి 100 వరకు ఓ.పీ ఉండేది. డాక్టర్ల సమ్మెతో వీరఘట్టం పీహెచ్‌సీ వెలవెలబోయింది. కొందరు రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు.


ఓపీ సేవలు నిలిచిపోవడంతో వెలవెలబోతున్న వీరఘట్టం పీహెచ్‌సీ

### సర్వీసు కోటా పోతుంది



“జీఓ నంబర్ 85 ప్రాప్తికి భవిష్యత్తు చదువులకై గ్రామీణ, పట్టణ పరిధిలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యులు చేసిన సేవలు వృథాగా మారుతాయి. ఏజెన్సీల్లో విధులు చేపట్టేందుకు ఎటువంటి అదనపు అలవెన్సులు తీసుకోవడం లేదు. వృత్తిపరంగా నైపుణ్యం సాధించే క్రమంలో పీజీలు చేసే అవకాశాలు తాజా జీఓతో తగ్గిపోతాయి. కేవలం ఐదు విభాగాలు మినహా మిగిలిన పీజీ కోర్సుల్లో చేరే అవకాశం కూడా ఉండదు. – ఎస్.రవికుమార్, వైద్యుడు, ఎం.సింగుపురం పీహెచ్‌సీ

### ఇదెక్కడి అన్యాయం



“ఏజెన్సీలో సేవలందిస్తే ఉన్నత చదువులకు అవకాశం ఉంటుందని కౌన్సెలింగ్‌లో చెప్పారు. అర్బన్ పరిధిలో ఆరు, రూరల్‌లో మూడు, ఏజెన్సీలో రెండేళ్ల కాలపరిమితితో సేవలు అందిస్తున్నాం. జీఓ 85 అమలు కారణంగా సర్వీసు కోల్పోవడంతో పాటు పీజీలో చేరే స్థానాల సంఖ్య తగ్గిపోనుంది. ఆర్థో, జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టీ, జనరల్ సర్జన్ మినహా మిగిలిన పీజీ కోర్సులు చదువుకునే అవకాశం కూడా ఉండదు. – బి.బి.అంకిత, వైద్యాధికారి, అన్నవరం, పీహెచ్‌సీ

- అత్యవసర సేవలకే వైద్యం



జియ్యమ్మవలస పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు

గుమ్మలక్ష్మీపురం: మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రభుత్వ వైద్యులకు ఇన్‌సర్వీస్ కోటా కుదింపును వ్యతిరేకిస్తూ పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు సోమవారం ఓపీ విధులను బహిష్కరించారు. అత్యవసర కేసులకు మాత్రమే వైద్యులు వైద్య సేవలు అందించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో తాడికొండ, దుడ్డుఖల్లు, రేగిడి, కురుపాం మండలంలోని మొండెంఖల్లు, నీలకంఠాపురం, కొమరాడ మండలంలోని కొమరాడ, కూనేరు రామభద్రాపురం, మాదలంగి, జియ్యమ్మవలస మండలంలోని జియ్యమ్మవలస, రావాడ రామభద్రాపురం, గరుగుబిల్లి మండలంలోని గరుగుబిల్లి, రావివలస గ్రామాల్లోని పీహెచ్‌సీలు నిర్మానుష్యంగా కనిపించాయి.



వైద్యులు ఓపీని బహిష్కరించడంతో నిర్మానుష్యంగా ఉన్న కొమరాడ పీహెచ్‌సీ

### యూరియా కోసం బారులు

సంతకవిటి: యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పనులు మానుకుని ఆర్ఎస్‌కేల వద్ద క్యూ కడుతున్నారు. సంతకవిటి మండలంలోని తాలాడ, మామిడిపల్లి గ్రామాల్లో సోమవారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. ఉదయం 5 గంటల నుంచి రైతులు సచివాలయాల వద్ద క్యూ కట్టగా ఒక్కో బస్తా చొప్పున అందజేశారు




## క్లుప్తంగా

### గంజాయితో ఐదుగురు నిందితుల అరెస్టు

బొండపల్లి: మండలంలోని గొట్లాం బైపాస్ రోడ్డు వద్ద మెటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా వారి దగ్గర బయటపడిన రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు మండలంలోని సాంపిగాం గ్రామానికి చెందిన సీదరపు రామరావుతో పాటు అదే మండలంలోని సామంతులవలస గ్రామానికి చెందిన మల్లి నాగరాజు ద్విచక్ర వాహనంపై తిరుగుతుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకోగా వారి వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే వారికి గంజాయి అమ్మకానికి సహకరించిన విజయనగరానికి చెందిన షేక్ మౌలాలి, వినుకొండల విజయ్ కుమార్, బారా సాయిలను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారి దగ్గర బైక్‌తో పాటు నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

### తండ్రి హత్య కేసులో తనయుడు

బొండపల్లి: ఈనెల 23 గురువారం రాత్రి మండలంలోని కొండకిండాం గ్రామంలో కిరాతకంగా ఇనుప రాడ్డుతో దాడి చేసి తండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడైన తనయుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. గ్రామానికి చెందిన పెద్ద మజ్జి నాయుడు బాబు, ఆయన ఏకైక కొడుకు గణేష్ కుమార్‌ల మధ్య ఆస్తి వివాదంలో ఘర్షణ జరగ్గా క్షణికావేశంలో తండ్రిపై ఇనుపరాడ్డుతో కొడుకు దాడి చేసి హత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహించి నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

### ముద్దాయికి మూడేళ్ల జైలుశిక్ష

గజపతినగరం: మెంటాడ మండలం పోరాం గ్రామరెవెన్యూ పరిధిలో ఓ మామిడి తోటలో ఉన్న వ్యక్తిపై దాడి చేసి చోరీకి పాల్పడి పరారైన ముద్దాయికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. తిరుమల రాజు జగన్నాథ రాజు అనే వ్యక్తి తలపై ఇటీవల వెదురుకర్రతో తీవ్రంగా కొట్టి రూ.10వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లు దొంగిలించి జె.భగవాన్ అనే నిందితుడు పరారయ్యాడు. ఈ కేసులో విచారణ అనంతరం ముద్దాయికి గజపతినగరం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.విజయ్ రాజ్‌కుమార్ మూడేళ్ల జైలు శిక్ష రూ. వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సోమవారం సాయంత్రం కోర్టు సిబ్బంది తెలిపారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి


పట్టాలపై మృతదేహం

బొబ్బిలి: స్థానిక రైల్వే స్టేషన్ యార్డు వద్ద గల రైల్వేలైన్‌పై రైలు ఢీకొని సుమారు 25–30 సంవత్సరాల మధ్య వయసు గల యువకుడు సోమవారం ఉదయం మృతిచెందినట్లు జీఆర్‌పీ హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. మృతుడి శరీరంపై ఎరుపు గళ్ల చొక్కా, బ్రౌన్ కలర్ ఫ్యాంట్ ఉన్నాయని చెప్పారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గుర్తుపడితే ఫోన్ 8309901038, 9491813163 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### క్విజ్ విజేత విజయనగరం


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: శ్రీకాకుళం జిల్లా లక్కవరం గ్రామంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అంతర్‌జిల్లాల క్విజ్ పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో గోకర్ణపురం, తృతీయ స్థానంలో బి.కేశుపురం నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేణుగోపాలరావు, నారాయణరావు, హేమసుందర్, వజ్జకృష్ణ పాల్గొన్నారు.

# సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం


అర్జీదారుల సమస్యను వింటున్న కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి


ఫిర్యాదులను తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ చిన్నబాబు

- కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన రెవెన్యూ, సంక్షేమం, అభివృద్ధి రెండు విభాగాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 102 వినతులను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్‌ఓ కె.హేమలత, ఎస్‌డీసీలు పి. ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖాధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా అధికారులను ఏర్పాటు చేస్తూ సమస్యలను సంపూర్ణంగా విన్నవించుకునే విధంగా అర్జీదారులకు అవకాశం కల్పించామని తెలిపారు. అలాగే ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ప్రజల పిటిషన్లకు పరిష్కారం**

ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి పిటిషన్లకు పరిష్కారం చూపిస్తూ, వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి సంబంధిత పోలీసు శాఖాధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న పలు స్టేషన్ల పరిధుల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 5 పిటిషన్లు స్వీకరించి, అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించగా వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ ఆదాం, సీసీఎస్ సీఐ అప్పారావు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

**ఐటీడీఏ పీజీఆర్‌ఎస్‌కు 23 వినతులు**

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 23 వినతులు వచ్చాయి. ఏపీఓ జి.చిన్నబాబు అర్జీలు స్వీకరించారు. తాడిపాయికి చెందిన నందిని భాషా వలంటీర్ పోస్టు ఇప్పించాలని కోరారు. పాతూరుకు చెందిన ఢిల్లేశ్వరరావు ఏదైనా ఆశ్రమపాఠశాలలో కుక్, కమాటి పోస్టులో నియమించాలని విజ్ఞప్తి చేశాడు. కొత్తకోటలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థలో ఉన్నందున కొత్త భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. మినీగురుకులానికి మౌలికవసతులు కల్పించాలని కె.వీరఘట్టానికి చెందిన బి.నీలకంఠం అర్జీ అందజేశాడు. అచ్యుతాపురానికి చెందిన బి.సుశీల వాటర్‌ప్లాంట్ మంజూరు చేయాలని కోరింది. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ రమాదేవి, డిప్యూటీఈఓ రామ్మోహన్‌రావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానందం తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహం

- ఓఎన్జీజీసీ క్రీడా స్కాలర్ షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- అక్టోబర్ 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె. శ్రీధరరావు

పార్వతీపురంటౌన్: ఓఎన్జీసీ క్రీడా స్కాలర్ షిప్ పథకం కింద 2025–26 సంవత్సరానికి గాను వెనుకబడిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 21 క్రీడా విభాగాల్లో సబ్–జూనియర్, జూనియర్, సీనియర్ పురుషులు, మహిళా క్రీడాకారులకు నెలకు రూ.15,000 నుంచి రూ.30,000 వరకు క్రీడా స్కాలర్ షిప్ లను 250 మందికి అందించనున్నారన్నారు. ఈ స్కాలర్ షిప్‌కు దరఖాస్తు చేసేందుకు 15 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు గల వారు దిగువ తెలిపిన క్రీడాంశాల్లో వెనుకబడిన ప్రతిభావంతులైన క్రీడాకారులు అర్హులన్నారు.

**క్రీడాంశాల వివరాలు**

అథ్లెటిక్స్ జూనియర్–సీనియర్ స్థాయి 20 సం.ల లోపు, బాడ్మింటన్ జూనియర్–సీనియర్ స్థాయి 19సం.పైబడి, బాస్కెట్ బాల్ జూనియర్–సీనియర్ స్థాయి 18సం.పైబడి, చెస్ జూనియర్–సీనియర్ స్థాయి 19 సం.ల పైబడి, క్రికెట్ జూనియర్ స్థాయి 19 సం.ల లోపు, ఫుట్ బాల్ జూనియర్ స్థాయి 19 సం.ల లోపు, హాకీ జూనియర్ స్థాయి 21 సం.ల లోపు, కబడ్డీ జూనియర్ స్థాయి 20 సం.ల లోపు, స్క్వాష్ జూనియర్ స్థాయి 19 సం.ల లోపు, టేబుల్ టెన్నిస్ జూనియర్ – సీనియర్ స్థాయి 19 సం.ల లోపు, టెన్నిస్ జూనియర్, సీనియర్ స్థాయి 18 సం.ల లోపు, వాలీబాల్ జూనియర్ స్థాయి 21 సం.ల లోపు, స్విమ్మింగ్ జూనియర్–సీనియర్ స్థాయి 17 సం.ల లోపు, ఆర్చరీ జూనియర్ – సీనియర్ స్థాయి 18 సం.ల లోపు, బాక్సింగ్ జూనియర్, సీనియర్ స్థాయి 18 సం.ల లోపు జిమ్నాస్టిక్స్ జూనియర్–సీనియర్ స్థాయి 16 సం.ల లోపు, పారా స్పోర్ట్స్, షూటింగ్ సబ్–జూనియర్–జూనియర్ స్థాయి 18 సం.ల లోపు, రెజ్లింగ్ సబ్–జూనియర్ స్థాయి 17 సం.ల లోపు, జూనియర్ స్థాయి 20 సం.ల లోపు, కేరమ్స్ సబ్–జూనియర్–జూనియర్ స్థాయి 18 సం.ల లోపు, ఖోఖో జూనియర్–సీనియర్ స్థాయి 18 సం.ల లోపు ఉండాలి. ఆసక్తి గల క్రీడాకారులు ఓఎన్జీసీ అధికారిక వెబ్‌సైట్ http://sportsschoarship.ongc.co.in లో అక్టోబర్ 21వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేయడానికి ముందు పోర్టల్‌లో ఇచ్చిన పథకం వివరాలతో పాటు నిబంధనలు, షరతులను గ్రహించాలని సూచించారు.

# హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

- 1998 ఎంటీఎస్ ఐపాధ్యాయ సంఘం పిలుపు


మాట్లాడుతున్న ఎంటీఎస్ సంఘం నాయకుడు ఉమాకామేశ్వరరావు

పార్వతీపురం: ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఉమ్మడి విజయనగరం జిల్లా ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘ నాయకుడు ఉమా కామేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలోని చర్చివీధిలో గల వేదాంత జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 98 డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థుల్లో వెలుగు నింపి ఉపాధ్యాయులుగా నియమించారన్నారు. ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలని, 12 నెలల జీతాన్ని ఇవ్వాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. న్యాయమైన హక్కుల సాధనకు, న్యాయపోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని కోరారు. 98 ఎంటీఎస్ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్టోబర్ 11న విజయవాడలో నిర్వహిస్తున్న విజ్ఞాపన సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా నాయకులు పీవీ రామ మోహనరావు, కె.రమేష్, దామోదరరావు, పూడు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారి కల్యాణం

- స్వామివారికి టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ


శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామిని రామతీర్థం తిరువీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు


వెండి మంటపం వద్ద స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు


స్వామివారికి తిరుముల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను సమర్పిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. వేకువజామున ఆలయంలో ప్రాతఃకాల పూజలనంతరం యాగశాలలో అర్చకులు విశేష హోమాలు జరిపించారు. శ్రీ వేంకటేశ్వరస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ రామతీర్థం తిరు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామాలయంలోని వెండి మంటపం వద్ద లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామిని తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి కల్యాణ వేడుకను కనులపండువగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, రామగోపాలాచార్యులు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి


విజేతకు బహుమతి అందజేస్తున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరంఫోర్ట్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఇటీవల నిర్వహించిన రెడ్‌రన్ మారథాన్ 5కెలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపరాదన్నారు. వారి పట్ల ప్రేమ అప్యాయత చూపించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు 20 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, పీడీలు

బొబ్బిలి రూరల్: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు 20 మందితో జట్టును ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయకుమార్ తెలియజేశారు. ఈ మేరకు బొబ్బిలి మండలంలోని పారాది జెడ్పీహెచ్ పాఠశాలల సోమవారం జరిగిన జిల్లా సీనియర్ మెన్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపికను పీడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించామని 60 మంది పాల్గొనగా ఉత్తమ ప్రతిభను కనబర్చిన 20 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని వారిని సత్తెనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నామని తెలిపారు.

# సీఎం రాక ఏర్పాట్ల పరిశీలన


కార్యకర్తలతో నిర్వహించే సభా ప్రాంగణం వద్ద చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ

దత్తిరాజేరు: దత్తి గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం వస్తున్న సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పింఛన్లు పంపిణీ చేసే ఇళ్లకు వెళ్లే మార్గాలను, వాహనాల పార్కింగ్, కూటమి నాయకులతో సమావేశం కానున్న హాల్‌ను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్దకు ఇతరులు రాకుండా కంచెను కట్టుదిట్టంగా వేయాలని, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధుల రాకపోకలకు అనువుగా అన్ని ఏర్పాట్లు ఉండాలని పోలీస్, ఇతర శాఖల అధికారులను అదేశించారు.

# భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

- కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: పైడితల్లి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పది అంశాలను అజెండాలో పొందుపరచగా.. సభ్యులు ఆమోదించారు. పైడితల్లి జాతర నేపథ్యంలో కార్పొరేషన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. వీధి దీపాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య పనులపై దృష్టి సారించామని చెప్పారు. ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ.. ఉత్సవాలు విజయవంతం కావడానికి అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణిక్య, జీవీ రంగారావు, సుంకర నారాయణస్వామి, రేగాన రూపాదేవి, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రీఅసెస్‌మెంట్ పూర్తయినా అందని టీఏడీఏలు..!

- దివ్యాంగులకు సదరం రీ అసెస్‌మెంట్ చేసిన వైద్యులు
- జిల్లాలో ఈఏడాది జనవరి నుంచి ప్రారంభమైన ప్రక్రియ
- 30 వేలకు పైగా దివ్యాంగులకు పరీక్షలు చేసి రీఅసెస్‌మెంట్
- వైద్యులకు టీఏ, డీఏల బకాయి


రీ అసెస్‌మెంట్‌కు వచ్చిన దివ్యాంగులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: దివ్యాంగులకు పింఛన్ వెరిఫికేషన్ పేరిట కూటమి సర్కార్ తీసుకొచ్చిన సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ నిర్వహించిన వైద్యులకు చెల్లించాల్సిన టీఏ, డీఏలు ఇవ్వకుండా కూటమి సర్కార్ జాప్యం చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రీ అసెస్‌మెంట్ జరిగి నెలలు గడుస్తున్నా ఇంతవరకు టీఏ, డీఏలు చెల్లించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత డబ్బులు పెట్టుకుని వైద్యులు వివిధ ప్రాంతాల నుంచి రీ అసెస్‌మెంట్ చేయడానికి ఆస్పత్రులకు వచ్చారు. రీ అసెస్ మెంట్ చేసినందుకు గాను వారికి చెల్లించాలిస్న టీఏ. డీఏలకు సంబంధించి డబ్బులు మాత్రం చెల్లించకుండా కూటమి సర్కార్ జాప్యం చేయడం పట్ల వైద్యులు ఆవేదన చెందుతున్నారు.

**రీ అసెస్‌మెంట్ నిర్వహించిన ఆస్పత్రులు**

జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట, రాజాం, సాలూరు ఏరియా ఆస్పత్రులు, పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగులకు రీ అసెస్‌మెంట్ నిర్వహించారు.

**రీఅసెస్ మెంట్‌లో 40 నుంచి 50 మంది వైద్యులు**

2025 జనవరిలో కూటమి ప్రభుత్వం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్న దివ్యాంగులకు రీఅసెస్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టింది. జనవరి నెలలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వారంలో మూడు రోజుల పాటు దివ్యాంగులకు రీ అసెస్ మెంట్ చేసేవారు. బుధ, గురు, శుక్రవారాల్లో ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు రీ అసెస్‌మెంట్ నిర్వహించారు.

**30వేల మందికి పైగా దివ్యాంగులకు పరీక్షలు**

జిల్లాలో వేలాది మంది దివ్యాంగులకు వైద్యులు రీఅసెస్‌మెంట్ చేశారు. దివ్యాంగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి రీ అసెస్‌మెంట్ సర్టిఫికెట్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కంటి, ఎముకలు, ఈఎన్‌టీ, మానసిక, న్యూరో విభాగాలకు సంబంధించి 30 వేలమందికి పైగా దివ్యాంగులకు వైద్యులు రీ అసెస్‌మెంట్ నిర్వహించారు.

**దూర ప్రాంతాల నుంచి వైద్యుల రాక**

జిల్లాలో దివ్యాంగులకు రీ అసెస్‌మెంట్ నిర్వహించేందుకు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చేవారు.

**త్వరలో చెల్లిస్తాం**

దివ్యాంగులకు రీ అసెస్‌మెంట్ నిర్వహించడానికి వచ్చిన వైద్యులకు టీఏ, డీఏలు చెల్లించాల్సి ఉంది. నిధులు వచ్చాయి. త్వరలోనే చెల్లిస్తాం.

– డాక్టర్ పద్మశ్రీ రాణి, జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి


**ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMETED**
District Office: Parvathipuram Manyam
Head Office: 10-152/1, Sri Sai Towers, Bandar Road, Kanuru, Vijayawada - 520007

**SHORT TERM TENDER NOTIFICATION**

Lr. No.PDS/Packing/OWS/2025-26 తేది: 29.09.2025

ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లాలోని APSCSCL ప్యాకింగ్ యూనిట్/ గోదాములలో ఆరు నెలల పాటు అంటే 31.03.2026 వరకు NCDEX ఇ-మార్కెట్స్ లిమిటెడ్ వేలం వేదిక ద్వారా 25 కిలోల బ్యాగులలో సన్నరకం బియ్యం మరియు 3 కిలోల ప్యాకెట్లలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్యాకింగ్ చేయడానికి ప్యాకింగ్ ఏజెన్సీని నియమించుటకు టెండర్లను ఆహ్వానించడమైనది.

ఆసక్తిగల టెండరులు www.apscscl.in లేదా www.neml.in వెబ్‌సైట్‌ను సందర్శించి టెండర్ పత్రాలను ఉచితంగా వీక్షించవచ్చు మరియు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

టెండర్‌లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు కస్టమర్ సర్వీస్ గ్రూప్‌ను ఫోన్ నెంబర్లు (+91-22) - 48810500/ 9962059599/ 9032429420 లేదా ఇమెయిల్ : askus@neml.in ద్వారా సంప్రదించవచ్చు. ఆన్‌లైన్ టెండర్లను సమర్పించడానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మరియు ఫార్మాలిటీలను పూర్తి చేయడానికి చివరి తేదీ 05.10.2025 సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుంది.

సం/- జాయింట్ కలెక్టర్ & EOED,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, పార్వతీపురం మన్యం జిల్లా


## భక్తిశ్రద్ధలతో చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: నగరంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో పైడితల్లి అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం చండీయాగం నిర్వహించారు. వేద పండితులు సాయికిరణ్, వెలువలపల్లి నరసింహమూర్తి శాస్త్రోక్తంగా యాగ ప్రక్రియను నిర్వహించారు. అనంతరం యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు.

# పీజీఆర్‌ఎస్‌పై సీఎం పర్యటన ఏర్పాట్ల ప్రభావం

- కలెక్టర్, జేసీ లేకపోవడంతో తగ్గిన వినతులు
- డీఆర్‌ఓ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ


అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి


ఫిర్యాదు దారుల సమస్యలను పరిశీలిస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పీజీఆర్‌ఎస్ కార్యక్రమంపై సీఎం జిల్లా పర్యటన ఏర్పాట్ల ప్రభావం పడింది. వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు లేకపోవడంతో సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన పలువురు ప్రజలు వెనుదిరిగారు. వినతులు ఇవ్వకుండా వెనుతిరిగిన అర్జీదారుల్లో ఎస్.కోట, విజయనగరం మండలాల నుంచి వచ్చిన రైతులు ఉన్నారు. పీజీఆర్‌ఎస్‌కు ప్రతి సోమవారం 200కు పైగా వచ్చే అర్జీలు ఈ వారం 134 మాత్రమే నమోదయ్యాయి. డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి అధ్వర్యంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరావు, మురళి, నూకరాజు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటిని పరిశీలించి, పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపించారు.

**ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 30 ఫిర్యాదులు**

విజయనగరం క్రైమ్: ఎస్పీ ఆదేశాలతో విజయనగరం డీఎస్పీ గోవిందరావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను పరేడ్ మైదానం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది ఫిర్యాదు దారులు తమ సమస్యలను డీఎస్పీకి విన్నవించారు.


సాక్షి క్లాసిఫైడ్స్

**WANTED**

■ కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9666253675 [HA-16158]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.